
షాడో ఇన్ జపాన్
MVS
PUBLICATIONS
మధుబాబు

# షాడో ఇన్ జపాన్

రచన

మధుబాబు

© Author
© Madhu Baabu
This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# షాడో ఇన్ జపాన్

నుదుటి మీదినుంచి కళ్ళల్లోకి జారుతున్న చెమటను చొక్కా చేతికి తుడుచుకుంటూ, చేతిలోని సమ్మెటను క్రిందపెట్టి, చుట్టూ చూశాడు షాడో.

నడుమెత్తున వున్న కొండరాళ్ళతో నిండివుంది ఆ ప్రదేశం. మిట్టమధ్యాహ్నపు ఎండవేడిమికి సెగలు పొగలు వెలువరిస్తున్నాయి ఆ కొండరాళ్లు. ఆ వేడిమిని లక్ష్యపెట్టకుండా తదేక దీక్షతో పనిచేస్తున్నారు అనేకమంది కార్మికులు.

సూచీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కొత్తగా కట్టబోతున్న గోడవున్లకు కొండరాళ్ళు కావాలట. నెలరోజులు చేయాల్సిన పనిని పది రోజుల్లోనే పూర్తి చేయించటానికి మహా తాపత్రయపడిపోతున్నారు ఎస్టేట్ అధికారులు.

రివ్వు రివ్వున గాలిలోకి లేస్తున్నాయి యినప సమ్మెటలు. ఖంగు ఖంగున శబ్దాలు చేస్తూ పగిలి, ముక్కలు అవుతున్నాయి యినుముకంటె గట్టిగా వుండే ఆ బండరాళ్ళు.

గుండెలనిండా గాలి పీల్చుకొని క్రింద పెట్టిన సమ్మెటను అందుకున్నాడు షాడో. అదే సమయంలో ఫెడీమని అతని వీపుమీద పడింది పేము బెత్తపుదెబ్బ ఒకటి.

"బ్లడీ రోగ్! పని మానేసి దిక్కులు చూస్తున్నావా? తాపీగా నిలబడటానికి యిదేమైనా నీ యిల్లు అనుకున్నావా?" ఉరుములాంటి కంఠంతో వికృతంగా అంటూ దెబ్బమీద దెబ్బగా మరో నాలుగు చురకల్ని అంటించాడు చిన్‌యాంగ్.

అక్కడి పనుల్ని సూపర్‌వైజ్ చేయటానికి జనరల్ మానేజర్ చేత ప్రత్యేకంగా నియమించబడ్డ చోటా అధికారి అతను.

బాధతో జివ్వుమన్నాయి షాడో శరీరంలోని నరాలన్నీ. అప్రయత్నంగా బిగుసుకున్నాయి అతని పిడికిళ్ళు, అంతలోనే తనెవరో, ఎక్కడున్నాడో, ఎందుకున్నాడో జ్ఞాపకం వచ్చిందతనికి. పళ్ళు బిగించి, తన ఆవేశాన్ని తనలోనే దాచుకొని తనపనిలో లీనమై పోయాడు.

గర్వంతో కూడిన చిరుదరహాసం ఒకటి వెంటనే ప్రత్యక్షం అయింది చిన్‌యాంగ్ పెదవులమీద.

"పనిచేయకుండా దిక్కులు చూస్తే వీపులు పెట్లి పోతాయి. యింకా మీకు తెలిసినట్లు లేదు. చర్మాలు వలిపించి ఫుజీ పర్వతం మీద ఎండవేస్తాను. ఖబడ్దార్...." అంటూ ముందుకు అడుగు వేశాడతను.

అప్పుడే సమ్మెటను క్రిందికి దించాడు అంతవరకూ ఆగకుండా పనిచేసిన యింకొక కార్మికుడు. ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ, ఒక బండచాటున వున్న మంచినీళ్ళ బానవైపు అడుగు వేశాడు.

అతన్ని చూసేసరికి ఎర్రగా కందిపోయింది చిన్‌యాంగ్ వదనం.

"బ్లడీ రాస్కెల్..... నా మాటలు నీకు వినబడటం లేదూ? మంచినీళ్ళ సాకుతో కబుర్లు చెప్పటానికి బయలుదేరావా? నన్ను చూసి కూడా యింత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తావా?" అని రంకెలు వేస్తూ పోయి అతని ముఖంమీద బలంగా కొట్టాడు పేము బెత్తంతో.

బాధతో గిలగిలలాడుతూ తూలి సరిగ్గా మంచినీళ్ళ బానమీద పడ్డాడు ఆ కార్మికుడు. ఆ అదటుకు పగిలి పోయింది బాన. అందులోని నీరంతా బండల పాలు అయింది.

అక్కడికి పది అడుగుల దూరంలో పనిచేస్తోంది ఒక పడుచు. రెండు సంవత్సరాల వయస్సుండే తన పసిబిడ్డను వీపుకు కట్టుకొని నిలబడి వున్నదామె. బానలోని నీరంతా వృధా అయిపోవటాన్ని గమనించేసరికి బాధగా తల విదిలించి, “మమ్మల్ని కొట్టినా, తిట్టినా మరేం పరవాలేదు సార్. ఎంతో దూరంనుంచి తెచ్చుకున్న నీళ్ళను ఎందుకూ కొరగాకుండా చేయటం న్యాయంగా వుందా?” అని అడిగింది.

ఆ మాటలతో శివమెక్కినట్లు యింతెత్తున ఎగిరి పడ్డాడు చిన్‌యాంగ్.

"బ్లడీ స్కాండ్రల్... నా చేతలనే ఆక్షేపిస్తున్నావా? నాకే నీతులు బోధిస్తున్నావా?” అని బుసలు కొడుతూ పోయి ఫెడీమని ఆమె వీపుమీద వేశాడు రెండు దెబ్బలు.

ఆమెకు తగలలేదా దెబ్బలు. ఆమె వీపుమీద పడుకొని వున్న పసికందుకు తగిలాయి. బాధను భరించలేక కెవ్వుమని గుక్క పట్టిందా బిడ్డ.

దాదాపు రెండు వందలమంది కూలీలు పని చేస్తున్నారక్కడ. కను చివరలనుంచి అందరూ చూశారు ఆ దృశ్యాన్ని. మనుష్యుల్ని పశువుల్లా హింసించి పనులు చేయించుకునే రోజులు ఏనాడో పోయాయని వారందరికీ తెలుసు. తెలిసి కూడా చిన్‌యాంగ్ చేతలకు అడ్డురాలేక పోయారు వారందరూ.

అతని చర్యలకు వ్యతిరేకంగా ఒక్కమాట అంటే చాలు. అన్న మరుక్షణం ఉద్యోగం వూడిపోతుంది. అంతే కాదు. తన ఆజ్ఞలను అమలు పరచటానికి అవసరమైతే మజిల్ పవర్‌ని వుపయోగించటానికి కూడా వెనుదీయడతను. అందుకోసమే ప్రత్యేకంగా ఏరికోరి తీసుకువచ్చాడతను రాక్షసులవంటి గార్డులు

పదిమందిని. లావాటి కర్రల్ని పట్టుకొని దూర దూరంగా నిలబడి వున్నారు వాళ్ళు. ఏ కార్మికుడైనా పెదవి కదిలించిన మరుక్షణం కాట్ల కుక్కల్లా వచ్చి మీద పడతారు.

"నామీద కోపంవస్తే నన్ను కొట్టరాదా? ముక్కు పచ్చలారని నా బిడ్డమీద మీకెందుకు సార్ యింత క్రోధం?" ఏడుస్తూ అడిగింది ఆ పడుచు.

అప్పటికీ తగ్గలేదు చిన్‌యాంగ్ కోపం. రాక్షసుడి మాదిరి వికటంగా నవ్వుతూ యింకో దెబ్బ వేయటానికి బెత్తంఎత్తాడు.

ఆ పైన ఆ దృశ్యాన్ని చూడలేక పోయాడు షాడో ప్రక్కనే పనిచేస్తున్న గంగారాం.

"తీసుకొచ్చి తీసుకొచ్చి యిటువంటి నర రూప పిశాచుల ముందర పడవేశావేమిటి కలకత్తా కాళీ? పసిబిడ్డల్ని హింసించే యీ దొంగ నాయాలి బుర్ర రామ కీర్తన పాడించే అవకాశం నాకు ఎప్పుడు యిస్తావ్?" అంటూ చేతిలోని యినుప సమ్మెటను ఎత్తి బలంగా కొట్టాడతను తన ముందున్న బండరాయిని.

"తప్పుకోండి చిన్‌యాంగ్ సార్.... తప్పుకోండి...." ఆందోళనగా అరిచాడు అది చూసిన ఒక కూలీ.

తప్పుకోలేదు చిన్‌యాంగ్. ఆఫ్టరాల్ ఒక కూలీ అరిచిన అరుపుకు బెదిరి ప్రక్కకు పోతే తన పరువు ఏమయ్యేటట్లు అనుకుంటూ వెనక్కి తిరిగి చూశాడు.

ఫట్ మని శబ్దంచేస్తూ పగిలింది గంగారాం ముందున్న బండరాయి. గింగిరాలు తిరుగుతూ నలుప్రక్కలకూ పోయాయి దాని ముక్కలు. రైఫిల్ బుల్లెట్‌లా వేగంగా బయలుదేరింది క్రికెట్ బాల్ సైజులోవున్న ఒక పలుకు. సూటిగా పోయి చిన్‌యాంగ్ నుదుటిమీద ఠపీమని తగిలింది.

కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడ్డాడు చిన్‌యాంగ్. గుండెలు జలదరించేటట్లు గావుకేక పెట్టి నిలుచున్న వాడు నిలుచున్నట్లే విరుచుకు పడిపోయాడు.

సమ్మెటలను క్రిందపారేసి పరుగు పరుగున అతని దగ్గిరికి పోయారు పదిమంది కార్మికులు. తాగటానికి తెచ్చుకున్న మంచినీళ్ళను అతని ముఖంమీద చిలకరించి తల పాగాలతో విసిరారు.

నీళ్ళు ముఖంమీద పడగానే లేచి కూర్చున్నాడు చిన్‌యాంగ్. బాధగా మూలుగుతూ ముఖాన్ని తడుముకునే సరికి చేతికి అంటింది ఎర్రటి రక్తం.

ఆ రక్తాన్ని చూసుకునే సరికి అతని ఆగ్రహానికి హద్దులు లేకుండా పోయాయి.

"బ్లడీ రోగ్....డర్టీ బాస్టర్డ్....నన్నే కొడతావా? నా రక్తాన్ని కళ్ళచూసి యింకా ప్రాణాలతో తిరుగుదామనే అనుకుంటున్నావా?" అని గర్జిస్తూ, క్రింద పడిన పేము బెత్తాన్ని అందుకొని గంగారాంవైపుపరుగుతీశాడు.

అతను అనుకొన్నది అనుకున్నట్లు జరిగినట్లయితే కథ యింకోక విధంగా వుండి వుండేది కాని అలా జరగలేదు. నాలుగు అడుగులు కూడా వేయకముందే ఫుట్‌బాల్ మాదిరి గుండ్రంగా వున్న ఒక బండమీద పడింది అతని ఎడమపాదం. వెంటనే కదిలి దూరంగా దొర్లిందా రాయి. ఆ కదలికకు బాలెన్స్ తప్పి యిసుకమూట పడినట్లు దబ్బున నేలమీద పడ్డాడతను. ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు అక్కడవున్న వారిలో కొందరు. నవ్వును ఆపుకోలేక కిసుక్కుమన్నారు మరి కొందరు.

అగ్నిలో ఆజ్యం పోసినట్లు రగులుకు పోతూ లేచాడు చిన్‌యాంగ్.

"రేయ్... రండిరా... వీడి ఎముకల్ని చూర్ణం చేయండి...." అని అరుస్తూ పెద్దగా చప్పట్లు చరిచాడు.

తెల్లగా పాలిపోయాయి కూలీల ముఖాలన్నీ. నవ్విన వారందరూ భయంతో వణికిపోతూ బండలచాటుకు జరిగారు.

దూర దూరంగా నిలబడివున్న గార్డులు అందరూ పరుగు పరుగున వచ్చి గంగారాంని చుట్టుముట్టారు.

"కొట్టండి... అతన్ని చితకకొట్టి నాకు చూపించండి" ఆవేశంతో వణికిపోతూ కీచుగా అరిచాడు చిన్‌యాంగ్.

వెర్రిగా నవ్వుతూ చేతిలోని కర్రను ఎత్తి గంగారాం భుజాల మీద బాదాడు ఒక గార్డు. ఆ దెబ్బకు కళ్ళు బైర్లు క్రమ్మి దూరంగా పారిపోవాలతను లెక్క ప్రకారం. అందుకు భిన్నంగా దెబ్బ కొట్టిన గార్డుకంటె బిగ్గరిగా నవ్వి తొడ చరిచాడతను.

"నా ప్రార్ధన ఆలకించి నేను కోరిన అవకాశం యిప్పించావా కలకత్తా కాళీ.... యిక చూడు తల్లీ నీ భక్తుడి పరాక్రమం.." అంటూ నడుముకు వున్న పాంటు బెల్టును సర్రున వూడలాగి గార్డులమీద కలబడ్డాడు.

అంతటితో ఆదిరిపోయి దూరంగా పారిపోయింది అక్కడి ప్రశాంతత. నోళ్ళు తెరుచుకొని చూస్తూవున్న కూలీలందరూ గావుకేకలు పెడుతూ తలా ఒక మూలకు పరుగుతీశారు.

చేతుల్లోవున్న కర్రల్ని ఎత్తి కొండరాళ్ళు దద్దరిల్లిపోయేలా అరుస్తూ గంగారాంని పడగొట్టటానికి ప్రయత్నించ సాగారు గార్డులు. శివమెత్తినట్లు చిందులువేస్తూ పాంటు బెల్టును గిర్రున తిప్పుతున్నాడతను.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=480**